30న మెగా ఉద్యోగ మేళా

కంఠేశ్వర్, ఆగస్టు 23 : జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 30న హెచ్‌సీఎల్ టెక్‌బీ కంపెనీ ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, కంపెనీ ప్రతినిధి రాజేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 విద్యా సంవత్సరంలో వొకేషనల్, సీఈసీ, హెచ్‌ఈసీ, టైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో 75 శాతం మార్కులతో పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఒక ఫొటోతో ఒరిజినల్‌తోపాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, రిజస్ట్రేషన్ కోసం 8074065803, 9701665424 నంబర్లకు ఫోన్‌చేయాలని సూచించారు.

18 నుంచి డైట్ కళాశాలలో పరీక్షలు

ఖలీల్‌వాడి, ఆగస్టు 23 : ఫెయిల్ అయిన రెండో సంవత్సరం విద్యార్థులకు డైట్ కళాశాలలో వచ్చేనెల 18 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో చైన్ స్నాచింగ్

- నాలుగు తులాల చైన్ లాక్కెళ్లిన దుండగులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు23: ఆర్మూర్ పరిధిలోని మామిడిపల్లి శివారులో హైవే పక్కన ఉన్న అయ్యప్ప ఆలయం వద్ద మహిళ మెడలో నుంచి నాలుగు తులాల బంగారం చైన్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. పెర్కిట్‌కు చెందిన బ్రాహ్మణపల్లి నర్సుబాయి స్థానిక ఎమ్మార్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న బంధువుల పెండ్లికి వెళ్లేందుకు పెర్కిట్ చౌరస్తా వద్ద ఆటో ఎక్కింది. ఆటోలో మరో మహిళ ఉండగా ఆమెను మామిడిపల్లి చౌరస్తా వద్ద దించి, ఎమ్మార్ గార్డెన్ వద్ద దింపుతానని వృద్ధురాలిని ఆటోడ్రైవర్ నమ్మించాడు. ఆటోలో ఉన్న మహిళ, ఆటోడ్రైవర్.. వృద్ధురాలికి మాయమాటలు చెప్పి హైవేకు ఆనుకొని ఉన్న అయ్యప్ప ఆలయం వద్దకు తీసుకెళ్లారు. వృద్ధురాలిపై ఇద్దరూ దాడి చేసి ఆమె మెడలోని బంగారం చైన్‌ను ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.

యువతి ఆత్మహత్య

మోర్తాడ్, ఆగస్టు23: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పోచమ్మగల్లీకి చెందిన గడ్డం రవళి (24) గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. ఆమె హైదరాబాద్‌లో చదువుకుంటున్నది. బుధవారం హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చింది. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నదని యువతి తండ్రి గడ్డం రాజేశ్వర్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల

ఖలీల్‌వాడి, ఆగస్టు 23 : నిజామాబాద్ జిల్లాకు 2024-25కు సంబంధించి మధ్యాహ్న భోజన బిల్లులు విడుదలైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుకింగ్ కాస్ట్‌కు రూ. 66లక్షల 98వేల 953, సీసీహెచ్ గౌరవ వేతనాలకు రూ. 20 లక్షల 44 వేలు విడుదల చేశారని తెలిపారు. మండలాల వారీగా ఎంఈవో, ఎస్ఎన్ఏ అకౌంట్లలో నిధులను జమచేసినట్లు పేర్కొన్నారు.

పది రోజులు.. ఐదు రోడ్డు ప్రమాదాలు

- డివైడర్ నిర్మాణానికి వేసిన కంకర రాళ్ల కుప్పలే కారణం
- రాత్రి సమయంలో కనబడని వైనం

నందిపేట్, ఆగస్టు 23: మండల కేంద్రంలో విస్తరించిన రోడ్డుపై డివైడర్ నిర్మించేందుకు ఉంచిన రాళ్ల కుప్పల కారణంగా తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాళ్ల కుప్పలు వేసిన పది రోజుల్లో ఐదు ప్రమాదాలు జరిగాయి. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డును వివేకానందా చౌరస్తా నుంచి నంది విగ్రహం వరకు విస్తరించారు. ఆ రోడ్డుపై డివైడర్‌ను నిర్మించనున్నారు. అందుకుగాను రోడ్డు మధ్యలో వరుసగా రాళ్ల కుప్పలను వేశారు. రాళ్ల కుప్పల వద్ద సూచికలు లేదా బారికేడ్లు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళలో ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల కాంతికి రోడ్డుపై ఉన్న రాళ్లు కనిపించడం లేదు. దీంతో వాహనాలు రాళ్లను ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్క రోజులోనే గంట వ్యవధిలో రెండు కార్లు ప్రమాదానికి గురయ్యాయి. ఓ ఆటో రాళ్ల కుప్పలపైకి ఎక్కి అదుపుతప్పి రోడ్డు పక్కన బైక్ మెకానిక్ దుకాణం ముందున్న ఐదు బైక్‌లను ఢీ కొట్టింది. అంతేకాకుండా మరో ఆటో, మరో కారు రాళ్ల పైకి ఎక్కి ప్రమాదానికి గురయ్యాయి. రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులుగానీ పోలీసులుగానీ సూచికలు బోర్డులు, బారికేడ్లు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. డివైడర్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నందిపేట్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డివైడర్ నిర్మాణం కోసం వేసిన కంకర రాళ్ల కుప్పలు

నరికివేతకు గురైన చెట్ల పరిశీలన

సిరికొండ, ఆగస్టు 23 : అటవీ ప్రాంతంలో చెట్లను నరికివేస్తున్న నేపథ్యంలో అటవీశాఖ డివిజనల్ అధికారి భవానీశంకర్.. సిబ్బందితో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలకేంద్రంలోని బొడ్డు మామిడి చెరువు సమీపంలో నరికివేతకు గురైన చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్ రేంజ్ అధికారులు ఐదు బృందాలుగా ఏర్పడి పందిమడుగు, తాటిపల్లి, చీమన్‌పల్లి, పాకాల పరిధిలో అక్రమంగా అటవీ భూమిని చదును చేసిన భూములను గుర్తిస్తున్నామని తెలిపారు. స్థానికంగా ఉన్న అటవీ శాఖ అధికారులపై వస్తున్న ఆరోపనలు నిజమైతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్మూర్ రేంజ్ అధికారి శ్రీనివాస్, నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నరికివేతకు గురైన చెట్లను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

చిన్నారి అనన్య కుటుంబానికి బిగాల ఆర్థిక సాయం

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖలీల్‌వాడి, ఆగస్టు 23 : జిల్లాకేంద్రంలోని వర్ని రోడ్‌లో కాలువలో గల్లంతైన చిన్నారి అనన్య మృతిచెందడంపై అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించి, వారితో ఆర్థిక సాయం పంపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సిర్పరాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, రవిచందర్, విక్రమ్‌గౌడ్, సత్యప్రకాశ్, ఎనుగందుల మురళి, జగత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి మృతి

- అంత్యక్రియల్లో పాల్గొన్న సీనియర్ నాయకులు

ఖలీల్‌వాడి, ఆగస్టు 23 : జిల్లాకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రేసు హన్మాండ్లు అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు, ఉద్యమకారులు సుజిత్ సింగ్, రవిచందర్, సత్యప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, చింతకాయల రాజు, ఎనుగందుల మురళి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేసు హన్మాండ్లు మృతదేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

ఎల్లారెడ్డిలో ఫ్లెక్సీల చిచ్చు

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఫొటో లేదని సుభాష్‌రెడ్డి ఫ్లెక్సీల తొలగింపు
- ఎమ్మెల్యే అనుచరులపై పోలీసులకు ఫిర్యాదు
- ఎల్లారెడ్డి కాంగ్రెస్‌లో రెండు వర్గాలు

ఎల్లారెడ్డి, ఆగస్టు 23: ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో రచ్చ మొదలైంది. ప్రోటోకాల్ పేరిట ఫ్లెక్సీని చించివేయడంతో వర్గపోరు మరోసారి బహిర్గతమైంది. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఫొటో లేకుండా నియోజకవర్గంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని అతడి అనుచరులు అంటున్నారు. ఎమ్మెల్యే ఫొటో లేకుండా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే క్షమించేది లేదని బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఈ విషయాన్ని గుర్తించుకోవాలని పేర్కొంటున్నారు.

ఎల్లారెడ్డి పట్టణంలోని వడ్డేపల్లి సుభాష్ రెడ్డి కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అనుచరులు తొలగించారు. నియోజక వర్గానికి చెందిన నాయకుల ను గౌరవించడం సంప్రదాయమని, అనవసరంగా ఘర్షణలు పెట్టుకోవద్దని ఈ సందర్భంగా వారు సూచించారు. పార్టీ ఎల్లారెడ్డి మండలాధ్యక్షుడు కుర్మ సాయిబాబా, మాజీ జడ్పీటీసీ షేక్ గయాజుద్దీన్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఫొటో లేకుండా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని తొలగించాలని రెండు రోజుల క్రితమే సుభాష్‌రెడ్డి అనుచరులకు తెలియజేశామన్నారు. వారు స్పందించకపోవడంతో తొలగించామని తెలిపారు. నియోజకవర్గంలో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఫ్లెక్సీలను ఏర్పాటుచేయడంతోనే కార్యకర్తల్లో భేదాభిప్రాయాలు వస్తున్నాయని అన్నారు. అందరూ ఏకంగా ఉన్నట్లు ప్రతి ఫ్లెక్సీనీ ఎమ్మెల్యే ఫొటోతోనే ఏర్పాటుచేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రోటోకాల్ పాటించాలన్నారు.

షబ్బీర్ అలీ ఫొటో ఎందుకు పెట్టడంలేదు..?

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అనుచరులు ఏర్పాటుచేస్తున్న ఫ్లెక్సీల్లో ప్రభుత్వ సలహాదారుడైన షబ్బీర్‌అలీ ఫొటో ఎందుకు పెట్టడం లేదని వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. కార్యకర్తలు ఏర్పాటుచేసే ఫ్లెక్సీల్లో ప్రోటోకాల్ ఉండదన్నారు. అనవసరంగా రాద్దాంతం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై తమ నాయకుడే సమాధానం చెబుతారన్నారు.

పోలీసులకు ఫిర్యాదు..

సుభాష్‌రెడ్డి కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని తొలగించిన విషయమై కాంగ్రెస్ పార్టీ నాయకుడు హఫీజ్ పటేల్ ఎల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేశారు. తమ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని తొలగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గాయపడిన జమీర్

ఐదేండ్ల బాలుడిపై వీధి కుక్కల దాడి

- తీవ్రంగా గాయపడిన బాలుడు

పొతంగల్, ఆగస్టు 23 : గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా కరుస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. మండలంలోని హంగర్గాఫారంలో రోడ్డుపై శుక్రవారం నడుచుకుంటూ వెళ్తున్న ఐదేండ్ల బాలుడు షేక్ జమీర్‌పై నాలుగు కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. బాలుడి వెనుకనే అతడి అమ్మమ్మ ఉండడం, వెంటనే అప్రమత్తమై కుక్కలను తరిమివేయడంతో బాలుడికి ప్రాణాపాయం తప్పింది. బాలుడిని చికిత్స నిమిత్తం కోటగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వీధి కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాహుల్‌గాంధీకి పెండ్లయిందా? లేదా?

బ్లిట్జ్ కథనంపై వివరణ ఇవ్వండి: బీజేపీ ఎంపీ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి పెండ్లయిందా? లేదా?.. పెళ్లయ్యిందంటూ బ్లిట్జ్ పత్రికలో ప్రచురితమైన కథనంపై వివరణ ఇవ్వాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో రాహుల్‌గాంధీ కార్యాలయానికి వెళ్లి, అక్కడి సిబ్బందికి బ్లిట్జ్ పత్రికను అందజేశారు. ఆయన స్వయంగా పత్రికను చదివి, అందులో వచ్చిన కథనంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. భారతదేశ వ్యవహారాలకు సంబంధించి విదేశీ మీడియా సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక సరైనదేనని రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ వాదిస్తున్నపుడు, బ్లిట్జ్ కథనం కూడా సరైనదేనా? అని ప్రశ్నించారు.

కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

రాజంపేట్, ఆగస్టు 23: పొలంలో విద్యుత్తు షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం అన్నారం తండాలో శుక్రవారం చోటుచేసుకున్నది. తండాకు చెందిన రైతు బానోత్ తిరుపతి(33) తనకున్న రెండెకరాలతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన తిరుపతికి.. పక్కనున్న పొలానికి కరెంట్ సరఫరా కోసం తీసుకున్న వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వికటించిన టీకా

సౌదీలో జగిత్యాల జిల్లా వాసి యువకుడి నరకయాతన

జగిత్యాల టౌన్, ఆగస్టు 23: హైదరాబాద్‌లోని ఒక గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో టీకా వేయించుకొని సౌదీకి వెళ్లిన ఓ యువకుడు టీకా వికటించి అస్వస్థతకు గురై నరకయాతన అనుభవిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాద్‌లోని గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలతోపాటు టీకా వేయించుకున్నాడు. ఢిల్లీలోని హెచ్‌ఆర్ ఇంటర్నేషనల్ అనే రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా జాబ్ వీసాపై జూలై 11న సౌదీ అరేబియాలోని ఆల్-బాద్ తాబూక్‌కు వెళ్లాడు. అక్కడ ఫ్యామ్కో కంపెనీ నియోమ్ ప్రాజెక్ట్‌లో క్లీనింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల తర్వాత టీకా తీసుకున్న కుడి భుజానికి ఇన్ఫెక్షన్ అయింది. మెరుగైన చికిత్స కోసం స్వదేశానికి పంపించాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని చంద్రశేఖర్ తల్లి ఆవేదన వ్యక్త చేసింది. తిరిగి స్వదేశానికి అత్యవసరంగా రప్పించడానికి చర్యలు తీసుకోవాలని అతని తల్లి లక్ష్మి గురువారం హైదరాబాద్‌లోని విదేశాంగ శాఖ పీవోఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించింది.

'నవోదయ' ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, ఆగస్టు 23 : కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్‌లో ఉన్న జవహర్ నవోదయ ప్రవేశపరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అధికారి దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు 6వతరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 16వ తేదీలోగా www.navodaya.gov.in, www. nvsad missionclass nine.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జనవరి 18న పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9701907749 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వేతనాల కోసం అంగన్‌వాడీల ధర్నా

కామారెడ్డి, ఆగస్టు 23:వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మినీ అంగన్‌వాడీ నిర్వాహకులు శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మెయిన్ టీచర్లకు సమానంగా మినీ అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా టీచర్లు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని కోరారు.

విష జ్వరంతో చిన్నారి మృతి

గీసుగొండ, ఆగస్టు 23: విష జ్వరంతో చిన్నారి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని విశ్వనాథపురంలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూల మహేందర్-శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ (9) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. 20న నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడిని సంప్రదించి సిరప్ వాడటంతో తగ్గింది. గురువారం చిన్నారికి వాంతులు, విరేచనాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

వనపర్తి జిల్లాలో దాహం.. దాహం

- నిలిచిన మిషన్ భగీరథ సరఫరా
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

వనపర్తి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. భగీరథ పైపులైన్‌కు అదనంగా పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద ప్రత్యేక ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ పథకంలోనే దాదాపు 57 కిలోమీటర్ల ప్రత్యేక లైన్‌కు ఆరుచోట్ల వాల్వ్‌లు ఏర్పాటు చేయలేదు. వేసవిలో చేయాలనుకున్నా నీటిఎద్దడి ఏర్పడుతుందన్న కారణంతో అప్పట్లో అధికారులు విరమించుకున్నారు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టడంతో జిల్లాలోని సగభాగానికిపైగా పట్టణాలు, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీనికితోడు రాజపేట సమీపంలో భగీరథ పైపులైన్ పగలడంతో నీటి సమస్య మరింత తీవ్రమైంది. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా ప్రజలకు సరిపోవడం లేదు. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యవసాయ బోరుమోటర్లను ఆశ్రయిస్తున్నారు. భగీరథ పథకంలో పలు పోస్టులు ఖాళీలు ఉండటంతో పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి మాట్లాడుతూ పైపులైన్లను అనుసరించి కొన్ని వాల్వ్‌లు ఏర్పాటు చేయడం కోసం నీటి సరఫరాను నిలిపివేసినట్టు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలనుకున్నా వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు.

జగత్‌పల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ గుంతలోంచి నీటిని తొలగిస్తున్న దృశ్యం

అన్నలు నా బిడ్డ జీవితాన్ని నాశనం చేశారు

- ఏడేండ్లు సేవ చేయించుకొని హతమార్చారు
- భోరున విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు

కాప్రా, ఆగస్టు 23: 'అమ్మా, నాకు ఉద్యోగం దొరకబోతోంది, త్వరలోనే మన కష్టాలు తీరుతాయి' అందరూ జాగ్రత్తగా ఉండండి అంటూ ఇంటి నుంచి వెళ్లిన పల్లెపాటి రాధ అటు నుంచి అటే అదృశ్యమై పోయిందనీ, ఏడేండ్ల తర్వాత విగతజీవిగా తిరిగి వచ్చిందని మావోయిస్టు రాధ అలియాస్ నీల్సో తల్లిదండ్రులు పల్లెపాటి పోచమ్మ, పల్లెపాటి బాలయ్య భోరున విలపిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పల్లెపాటి బాలయ్య జీవనోపాధి కోసం కుటుంబంతో 35 ఏండ్ల క్రితం కాప్రాలోని ఇందిరానగర్‌కు వచ్చాడు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె రాధ అలియాస్ నీల్సో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ)కోర్సు పూర్తి చేసింది. మహిళలను చైతన్యం చేసేందుకు, వరకట్న దురాచారాలను, మద్యం వంటి చెడు అలవాట్లనుంచి కుటుంబాలను దూరం చేసేందుకు ఆమె స్వచ్ఛంద సంస్థలో చేరింది. చక్కటి గొంతు, తెలివితేటలు, సమాజాన్ని చైతన్య పరిచాలనే దృక్పథం నచ్చి ఆమెను స్వచ్ఛంద సంస్థ వారు చేర్చుకున్నారు. ఆ సంస్థవారే తమ బిడ్డను ఉద్యమం బాట పట్టిస్తారని ఊహించలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. 2017లో 17 ఏండ్ల వయస్సులో రాధ తమను విడిచి వెళ్లిందని, ఎంత వెతికినా దొరకలేదని చెప్పారు. ఆమె మావోయిస్టుల దళంలో చేరినట్టు మూడేండ్ల క్రితం తెలిసిందని అన్నారు. ఈ నెల 19న ఆమె మృతి చెందిందని, భద్రాచలం వద్ద మృతదేహం ఉన్నట్టు సమాచారం వచ్చిందని తెలిపారు. రాధను ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులే చంపారని చెప్పారు. ఆమె ఉద్యమానికి ద్రోహం తలపెట్టే వ్యక్తి అయితే ఏడేండ్లు ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. దళితురాలు అయినందునే కోవర్టు ఆరోపణతో హతమార్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంతోమంది ఎన్నో ఏండ్లు నక్సల్స్‌గా పనిచేసి ఏదో ఒక దశలో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారని, తన బిడ్డకు మాత్రం ఆ అవకాశం లేకుండా చేశారని విలపించారు. 'ఏడేండ్లు సేవ చేయించుకున్నారు, నా బిడ్డను ఎలా చంపాలనిపించిందయ్యా మీకు' అని తల్లి పోచమ్మ గొల్లుమంది. పేదరికంలో ఉన్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.

ఇంటిముందు విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు పోచమ్మ, బాలయ్య

'తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవు'

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవని, స్వార్జిత ఆస్తిని తనకు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చే అధికారం తల్లికి ఉంటుందని హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సుశీల్ అగర్వాల్ అనే మహిళకు భర్త నుంచి సంక్రమించిన ఇంటిని ముగ్గురు కుమారులకు సమానంగా పంచకుండా పెద్దకుమారుడి పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ చేయడాన్ని సివిల్ కోర్టు సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ భజరంగ్‌లాల్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని ధర్మాసనం కొట్టివేసింది. ఆ ఆస్తిని ఉమ్మడి కుటుంబ ఆస్తిగా ప్రకటించాలన్న వాదన చట్ట వ్యతిరేకమని తేల్చింది. ఆ ఆస్తి యజమానిగా తల్లికే పూర్తి హక్కులు ఉంటాయని తీర్పు చెప్పింది.

ఆ అధికారం ఐటీడీఏ పీవోలకు లేదు

- సివిల్ సూట్ల విచారణపై హైకోర్టు స్పష్టీకరణ
- పెండింగ్ సూట్లను కలెక్టర్లకు అప్పగించాలని తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ ప్రాంతాల్లో సివిల్ సూట్లను విచారించే అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో)కి లేదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏజెన్సీ చట్ట నిబంధనల ప్రకారం సివిల్ సూట్లపై విచారణ జరిపే అధికారం జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉన్నదని, ఆ అధికారాన్ని ప్రభుత్వ అదనపు ఏజెంట్లుగా పీవోలకు కట్టబెట్టడం చెల్లదని స్పష్టం చేసింది. 2002లో ఉట్నూరు ఐటీడీఏ పీవోకు సివిల్ సూట్లను విచారించే అధికారాన్ని అప్పగిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఐటీడీఏ పీవోల వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ సూట్లను కలెక్టర్లకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఒక సివిల్ వివాదంలో డాక్యుమెంట్లను పరిశీలించేందుకు చేతిరాత నిపుణులకు పంపాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ ఉట్నూరు ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీచేయడంపై హస్నాపూర్ గ్రామానికి చెందిన చవన్ ప్రకాశ్ హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ కే శరత్ శుక్రవారం ఈ తీర్పును వెలువరించారు.


కమిటీ కుర్రోళ్లు
U/A
NIHARIKA KONIDELA PRODUCTION
3వ వారం
U/A
సప్తగిరి 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
భ్రమరాంబ 70 ఎ/సి - కూకట్‌పల్